**Eenadu**

# 30లోగా 9 ఉద్యోగ ప్రకటనలు

- ఏఈతో సహా 256 ఉద్యోగాల భర్తీ
- డిసెంబరులోగా మిగిలిన ప్రకటనల జారీ
- నెగిటివ్ మార్కుల విధానం అమలు
- ఆన్‌లైన్‌లోనే ప్రధాన పరీక్షలు
- వయో పరిమితిపై ప్రభుత్వానికి లేఖ
- ఏపీపీఎస్సీ కమిషన్‌లో నిర్ణయాలు

ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 256 ఉద్యోగాల భర్తీకి సంబంధించి తొమ్మిది ప్రకటనలను ఈ నెల 30లోగా జారీచేయనుంది. ఇందులో గ్రూపు-1, 2, 3, ఇతర ఉద్యోగాలున్నాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపిన 4009 ఉద్యోగాల ఖాళీల్ని అనుసరించి ఈ ప్రకటనల్ని జారీచేయనుంది. ఇటీవల జారీచేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటనతో సహా త్వరలో జారీ చేయబోయే అన్ని రకాల నోటిఫికేషన్లకు దరఖాస్తులు 25 వేలు దాటితే వడపోత కోసం పెన్ను, పేపరుతో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. ప్రధాన పరీక్షలను ఆన్‌లైన్‌లో సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనుంది. రుణాత్మక (నెగిటివ్) మార్కుల విధానాన్ని అమలు చేయాలనీ కూడా ఏపీపీఎస్సీ నిర్ణయించింది. యూపీఎస్సీ తరహాలో ప్రధాన పరీక్షలకు అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా కాకుండా సామాజికవర్గాల వారీగా 1:12 నుంచి 1:15 మధ్య ఎంపిక చేసేందుకు అనుమతినివ్వాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగిన తొలి కమిషన్ సమావేశంలో సభ్యులు సీతారామరాజు, పద్మరాజు, రంగ జనార్దన, విజయకుమార్, జి.సుజాత, కార్యదర్శి (మిగతా 2లో)

# 30లోగా 9 ఉద్యోగ ప్రకటనలు

(మొదటి పేజీ తరువాయి)

వైవీఎస్‌టీ శాయి పాల్గొన్నారు. ఉదయ్‌బాస్కర్ ఆ వివరాలను విలేకరులకు తెలియజేశారు.

★ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ ఉద్యోగాల భర్తీ ప్రకటన అనుసరించి 71వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు మామూలుగా ఒక్కో పేపరుకు 150 మార్కుల చొప్పున మూడు పేపర్లు రాయాలి. ఇప్పుడు వడపోత కోసం ప్రిలిమ్స్ నిర్వహించాలని నిర్ణయించాము. 150 మార్కులకు ఒకే పేపరు ఉంటుంది. ప్రధాన పరీక్ష కోసం ఒక్కో పేపరుకు నిర్దేశించిన సిలబస్ నుంచే 50 మార్కుల చొప్పున 150 ప్రశ్నలుంటాయి.

★ ప్రతి సరైన జవాబుకు ఒక మార్కును ఇస్తారు. అదే తప్పు అయితే..ప్రతి తప్పునకు మూడో వంతు మార్కును తగ్గిస్తారు. ఎ,బి,సి,డి విధానంలో జవాబుల్ని గుర్తించే ప్రక్రియలో ఏదోఒక దానికి జవాబు పెట్టి లబ్ధిపొందకుండా ఉండేందుకు నెగిటివ్ విధానాన్ని ఎ.ఇ.ఇ. ఉద్యోగ ప్రకటన నుంచే అమలుచేయబోతున్నాము.

★ గ్రూపు-2 ఉద్యోగాలకు సంబంధించి ఆయా శాఖల నుంచి ఇంకా సమాచారం రావాలి. గ్రూపు-3 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల సమాచారం వచ్చింది. వీటితోపాటు ఇతర ఉద్యోగాల భర్తీ ప్రకటనలను ఈ ఏడాది చివరికల్లా ఇచ్చేస్తాము.

★ దరఖాస్తుల సంఖ్య 25వేలు దాటితే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. దరఖాస్తుల సంఖ్య అనుసరించి స్క్రీనింగ్ టెస్ట్ విధానం అమలుపై కమిషన్ అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాన్ని తీసుకుంటుంది. ప్రశ్నలు జంబ్లింగ్‌లో ఉంటాయి. జవాబుల్ని కూడా జంబ్లింగ్ చేయడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారానే ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాలకు పంపిస్తాము.

★ ఈ నెల 30వ తేదీలోగా 40 సంవత్సరాలు నిండకుండా ఎవరైతే ఉంటారో వారు కనీసం ఏడాది పాటు ఉద్యోగ ప్రకటనల జారీకి అనుగుణంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాము. ప్రభుత్వం ఆమోదం తెలిపిన ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లను ఈ నెలాఖరులోగా ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నందున ఈ విధంగా చేస్తున్నాము. ప్రభుత్వం రెండేళ్ల కిందట వయోపరిమితి పెంపుపై జారీచేసిన ఉత్తర్వుల కాలపరిమితి ఈ నెల 30వ తేదీతో ముగుస్తుంది.



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ చిత్రంలో (ఎడమ నుంచి) సభ్యులు జి.సుజాత, సీతారామరాజు, రంగ జనార్ధన, పద్మరాజు, విజయకుమార్

## 30లోగా జారీచేయనున్న ప్రకటనలివే!

| | |
|---|---|
| ★ జారీ చేయనున్న ప్రకటనలు అసిస్టెంట్ ఇంజినీర్లు | 199 |
| ★ అసిస్టెంట్ హైడ్రోలజిస్ట్ | 09 |
| ★ అసిస్టెంట్ హైడ్రోజియోలజిస్ట్ | 12 |
| ★ టెక్నికల్ అసిస్టెంట్ (హైడ్రోలజి) | 05 |
| ★ టెక్నికల్ అసిస్టెంట్ (హైడ్రో. జియోలజి) | 13 |
| ★ వెల్ఫేర్ ఆర్గనైజర్ | 06 |
| ★ జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ | 07 |
| ★ లాబ్ అసిస్టెంట్ | 03 |
| ★ డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్ | 02 |

★ ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వాన్ని 4 ఎకరాల స్థలాన్ని కోరాము. ఇస్తే 2018 నాటికి నిర్మాణాల్ని పూర్తిచేసుకుంటాము. సాధ్యం కాకుంటే వచ్చే ఏడాది ఏప్రిల్ లోగా అద్దె భవనంలోనికి వెళ్లాలన్నది ఆలోచన.

★ 1999 ఉద్యోగ ఖాళీల ప్రకటన అనుసరించి 54 మందికి మౌఖిక పరీక్షల్ని నిర్వహించబోతున్నాము. సుప్రీంకోర్టు ఆదేశాల్ని అనుసరించి ఈ చర్యల్ని తీసుకుంటున్నాము. ఈ ప్రక్రియలో ఉద్యోగాల్ని కోల్పోయే వారికి సూపర్‌న్యూమరరీ ద్వారా న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరాము. 2011 గ్రూపు-1 ప్రధాన పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో తగిన జాగ్రత్తల్ని తీసుకుంటున్నాము. దీనికి తగిన సమయం అవసరం ఉంది. జారీచేసిన ప్రకటన అనుసరించి మిగిలిన ఉద్యోగాల్ని తదుపరి స్థానాల్లో ఉన్న వారితో భర్తీచేయాలన్న రూల్.7ను ప్రభుత్వం రద్దుచేసింది. ఈ విధానం ఏఈఈ నోటిఫికేషన్ నుంచి అమల్లోకి వచ్చింది.

★ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల నియామక పరీక్షకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.